క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం


ముసూడి రత్నం

నరసాపురం: జూన్ 4వ తేదీ వెలువడనున్న ఫలితాల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం అని ఆ పార్టీ ఎస్సీసెల్ నాయకుడు ముసూడి రత్నం ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ తిరుగులేని మెజార్టీతో అత్యధిక సీట్లు గెలుచుకుంటుందని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. కూటమి నేతలు ఓటమి భయంతో మైండ్‌గేమ్ ఆడుతున్నా అవేమి పనిచేయవని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలకు ప్రజలు మద్దతుగా నిలిచారని చెప్పారు. ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ కనుమరుగయ్యే అవకాశం ఉందన్నారు.

వైభవంగా మర్లమ్మ జాతర

నరసాపురం రూరల్: మండలంలోని యర్రంశెట్టివారిపాలెం గ్రామంలో ఉన్న శ్రీ మర్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతర మహోత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం అమ్మవారి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆసాదుల నృత్యాలు, బుట్టబొమ్మలు, తీన్‌మార్ వాయిద్యాలతో అత్యంత కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, పలువురు కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకున్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

మొగల్తూరు: కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్నామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలగంశెట్టి సత్యనారాయణ తెలిపారు. సీఐటీయూ ఆవిర్భవించి 54 సంవత్సరాలు అయిన సందర్భంగా గురువారం మొగల్తూరులో ఆ సంఘ నాయకులు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రసన్నకుమారి, పెద్దింట్లు, దుర్గ, బోసుబాబు, బజార్ జట్టు కార్మికులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు

నరసాపురం: నరసాపురం గ్రేడ్–1 శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులకు డ్రాయింగ్‌లో శిక్షణ ఇచ్చారు. ప్రతి రోజూ దినపత్రికలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. యోగాలో శిక్షణ ఇచ్చారు. బార్క్ శాస్త్రవేత్త రంగినీడి సుబ్బారావు మానవ నాడీ వ్యవస్థ నిర్మాణంపై అవగాహన కల్పించారు. వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలవైపు అడుగులు వేయాలని సూచించారు. లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది.

హుండీ ఆదాయం లెక్కింపు


పెద్దింట్లమ్మ ఆలయం వద్ద హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

పెనుగొండ: స్థానికమల్లప్ప దిబ్బలోని పెద్దింట్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు ద్వారా రూ.3,08,272 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పుష్పభాను తెలిపారు. గురువారం నాలుగు నెలలకు గానూ హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తణుకు డివిజన్ అధికారి జీఎస్‌వీ ప్రసాద్, ఆలయ ఈఓలు మన్నే శ్రీనివాస్, వి వివేకానంద వర్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

నరసాపురం రూరల్: నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నరసాపురం 216 జాతీయ రహదారిపై చిట్టవరం సమీపంలో హెచ్‌పీ బంక్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న దంపతులు తీవ్ర గాయాలపాయ్యారు. దీనికి సంబంధించి రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జాతీయ రహదారిపై నరసాపురం వైపు నుంచి వెళ్తున్న కారు పాలకొల్లు నుంచి నరసాపురం బైక్‌పై వస్తున్న దంపతులను వేగంగా ఢీకొట్టింది. కారు వేగంగా ఢీకొనడంతో పక్కనే ఉన్న ఇనుప కంచె కిందకు బైక్ దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో దంపతులతో పాటు బైక్‌పై ఉన్న ఇద్దరు పిల్లలు కూడా గాయాలయ్యాయి. కారు ముందు బాగం నుజ్జునుజ్జు అయింది. అయినప్పటికీ కారును ఆపకుండా వెళ్లిపోయేందుకు ప్రయత్నించడంతో పలువురు వాహనదారులు సగంచెరువు సమీపంలో కారును ఆపు చేయించారు. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన దంపతులిద్దరినీ 108 వాహనంలో తొలుత పాలకొల్లు ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం రాజమండ్రికి తరలించినట్లు తెలిపారు. అయితే గాయపడిన దంపతులు రాజమండ్రికి చెందిన వారిగా గుర్తించారు. వారి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గుర్రయ్య తెలిపారు.

పాలకొల్లు ఉత్సవాలకు నెలవు

వినూత్నంగా అమ్మవార్ల ఉత్సవాలు


కనకదుర్గమ్మ తల్లి
యడ్లబజారు సెంటర్


మావుళ్లమ్మ తల్లి
మావుళ్లమ్మ పేట


ముఖదారమ్మ తల్లి
చిత్రావి చెరువు గట్టు


మావూరమ్మ తల్లి
బంగారువారి చెరువు గట్టు

కొండాలమ్మ తల్లి


కొండాలమ్మ తల్లి, ముచ్చర్లవారి పుంత

స్థానిక ముచ్చర్లవారి పుంతలో కొలువై ఉన్న అమ్మవారు శ్రీ కొండాలమ్మ తల్లి. ఈ అమ్మవారి ఉత్సవాలు ఉగాది పండుగ వెళ్లిన తరువాత వచ్చే శనివారం నాడు అమ్మవారికి ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. అమ్మవారి ఉత్సవాలు ఐదు రోజుల పాటు నిర్వహిస్తుంటారు.

పాలకొల్లు సెంట్రల్: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ వస్తుందంటే చాలు గ్రామదేవతల ఉత్సవాలు ప్రారంభం అవుతుంటాయి. ఒక్కో అమ్మవారికి ఒక్కో రోజున ఉత్సవ కమిటీ సభ్యులు తమ శక్తి కొలదీ ఉత్సవాలను భారీ స్థాయిలో నిర్వహిస్తుంటారు. అలా పాలకొల్లు పట్టణంలో మొత్తం పట్టణ గ్రామ దేవతగా శ్రీ మావుళ్లమ్మ విరాజిల్లుతుండగా ఆమె తోబుట్టువులుగా శ్రీ ముఖధారమ్మ, శ్రీ మావూరమ్మ, శ్రీ పెద్దింట్లమ్మ, శ్రీ పుంతలోముసలమ్మ, శ్రీ కొండాలమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ దేశాలమ్మ, శ్రీ మావుళ్లమ్మలు పట్టణంలో కొలువై ఉన్నారు. గ్రామదేవతలందరికి అక్కగా శ్రీ కనకదుర్గమ విరాజిల్లుతుందని పూర్వీకులు చెబుతున్నారు. పట్టణంలో అమ్మవార్లకు జరిగే ఉత్సవాల్లో ఒక విశిష్టత కనిపిస్తుంటుంది. ఉగాది పండుగ పురస్కరించుకుని పట్టణంలో శ్రీ ముఖధారమ్మ అమ్మవారి ఉత్సవాలు మొదటిగా ప్రారంభమవుతాయి. ఆ తర్వాత 15 రోజులకు శ్రీ మావూరమ్మ ఉత్సవాలు, ఆపై 15 రోజులకు పెద్దింట్లమ్మ, ఆపై 15 రోజులకు గ్రామ దేవత శ్రీ మావుళ్లమ్మ ఉత్సవాలు పట్టణంలో ప్రధానంగా నిర్వహిస్తుంటారు. ఆపై మిగతా అమ్మవార్ల ఉత్సవాలను ఈ నలుగురు అమ్మవార్ల ఉత్సవాలు జరుగుతున్న సమయంలో ముహూర్తాలు పెట్టుకుని నిర్వహిస్తుంటామని మిగిలిన అమ్మవార్ల ఉత్సవ కమిటీల సభ్యులు చెబుతున్నారు. ఇక్కడ అమ్మవార్ల ఉత్సవాలు నిర్వహించే సమయంలో పట్టణంలో ఉన్న అన్ని అమ్మవార్ల ఆలయాలకు చలిమిడి, పానకాల కావిడి తీసుకువెళ్లి వాయినాలు సమర్పించి వస్తుంటారు.

ముఖదారమ్మ

పట్టణంలోని 17వ వార్డులో చిత్రావిచెరువు గట్టున కొలువై ఉన్న శ్రీ ముఖధారమ్మ అమ్మవారి ఉత్సవాలు తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ రోజున ప్రారంభిస్తుంటారు. పట్టణంలో వెండి చీరలో వెలుగొందుతున్న అమ్మగా ముఖదారమ్మ ఉభయగోదావరి జిల్లాల్లో ప్రాచుర్యం పొందింది. అమ్మవారిని ఉగాది పర్వదినం నాడు వెండి చీరలో చూడడానికి దూర ప్రాంతాల నుండి భక్తులు వేలాదిగా తరలి వస్తుంటారు. ఈ అమ్మవారికి ప్రదక్షిణలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల అపారనమ్మకం. ఉగాది నుంచి వారం రోజులు పాటు ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ప్రతి శుక్రవారం అమ్మవారి ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్నారు.

మావూరమ్మ తల్లి

స్థానిక బంగారు వారి చెరువుగట్టున కొలువై ఉన్న శ్రీ మావూరమ్మ తల్లి ఉత్సవాలు చైత్రమాశంలో వచ్చే పౌర్ణమి నాడు ప్రారంభిస్తారు. ఈ ఉత్సవాల్లో ప్రతి సంవత్సరం అమ్మవారికి లక్షమల్లెల పూజ చేస్తుంటారు. అలాగే ప్రతీ శుక్రవారం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు.

పెద్దింట్లమ్మ తల్లి

స్థానిక బోళ్లవారి వీధిలో కొలువై ఉన్న శ్రీ పెద్దింట్లమ్మ అమ్మవారి ఉత్సవాలు ప్రతీ సంవత్సరం వైశాఖ శుద్ధ అమావాస్య నాడు ప్రారంభిస్తుంటారు. ఈ ఉత్సవాలు ఐదు రోజుల పాటు నిర్వహిస్తుంటారు.

మహాలక్ష్మి అమ్మవారు

స్థానిక పల్లపు వీధిలో కొలువై ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు వైశాక మాసంలో మహూర్తం చూసుకుని ఉత్సవాలు చేస్తుంటారు. అమ్మవారి ఉత్సవాలు గత కొంతకాలం నుండి భారీ స్థాయిలో నిర్వహిస్తున్నారు.

మావుళ్లమ్మ

స్థానిక మావుళ్లమ్మ పేటలో కొలువై ఉన్న శ్రీ మావుళ్లమ్మ తల్లి ఉత్సవాలను వైశాఖ శుద్ధ పౌర్ణిమి తరువాత వచ్చే శనివారం ఉత్సవాలు చేస్తుంటారు. గ్రామదేవతగా అమ్మవారు పట్టణంలో పూజలందుకుంటుంది. ఈ ఆలయంలో మావుళ్లమ్మతో పాటు సరస్వతి, మారెమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లు కొలువై ఉంటారు. గ్రామంలో ఎవరు వివాహం చేసుకున్నా ముందుగా అమ్మవారిని వచ్చి దర్శించుకుంటారని నిర్వాహకులు చెపుతున్నారు. అలాగే షావుకారు పేటలో మావుళ్లమ్మ తల్లి కొలువై ఉంది. ఇక్కడ అమ్మవారి ఉత్సవాలు జూన్ మొదటి వారంలో నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

దేశాలమ్మ తల్లి

స్థానిక లాకు సెంటర్ చింతల తోటలో కొలువై ఉన్న శ్రీ దేశాలమ్మతల్లి పట్టణంలో అత్యంత వైభవంగా ఉత్సవాలు జరిగే అమ్మవార్లలో ప్రథమ దేవత. ఈ అమ్మవారి ఉత్సవాలను మావుళ్లమ్మ ఉత్సవాలు అనంతరం వచ్చే సోమవారం నిర్వహిస్తుంటారు. పట్టణంలో ఉన్న అమ్మవార్లలో దేశాలమ్మ లాకు సెంటర్ వద్ద పాలకొల్లు భీమవరం ప్రధాన రహదారిలో ఉండడంతో ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుతుంటారు. ఈ అమ్మవారి ఉత్సవాల్లో బాణసంచా సామగ్రి కాల్పును చూడడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో జనం రావడం విశేషం. అర్ధరాత్రి 1 గంట సమయంలో మందుగుండు ప్రత్యేకంగా కాలుస్తుంటారు.

పుంతలో ముసలమ్మ

స్థానిక రామగుండం పార్కు సెంటర్లో కోర్టు, తహసీల్దార్ కార్యాలయాల మధ్యలో కొలువై ఉన్న శ్రీ పుంతలో ముసలమ్మ ఉత్సవాలు సంక్రాంతి పండుగ నాడు నిర్వహిస్తుంటారు. పుంతలో ముసలమ్మకు, ముఖదారమ్మకు పుట్టింటి తరుపున పిన్ని కుటుంబీకులు ముందుగా జాతర నిర్వహిస్తుంటారు. అలాగే పట్టణంలో పుంతలో ముసలమ్మ అమ్మవార్లు సలాది వారి తోటలో, రంగమన్నారు పేటలో, కటికిల వారి వీధిలో కొలువై ఉన్నారు. ఈ అమ్మవార్ల ఉత్సవాలను వివిధ సమయాల్లో ముహూర్తాలు చూసుకుని ఉత్సవాలు నిర్వహిస్తుంటారు.

కనకదుర్గమ్మ

స్థానిక యడ్లబజారు సెంటర్లో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలు ప్రతీ సంవత్సరం పాల్గుణ శుద్ధ దశమి నాడు ప్రారంభిస్తుంటారు. ఏకాదశినాడు దుర్గామల్లేశ్వరస్వామివార్ల దివ్య కళ్యాణం నిర్వహిస్తారు. అనంతరం అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారు. దేవదాయ ధర్మాదాయ శాఖ పరిదిలో ఉన్న ఏకైక అమ్మవారి ఆలయం. ఈ ఉత్సవాలు తొమ్మిదిరోజుల పాటు నిర్వహిస్తుంటారు. అలాగే విజయదశమి ఉత్సవాలు పురస్కరించుకుని తొమ్మిది రోజులు ప్రత్యేకంగా అమ్మవార్లను అలంకరిస్తుంటారు. పట్టణంలో గ్రామ దేవతలకు అక్కగా విరాజిల్లుతుంది.

వడ్డిపోలమాంబ, కుంచమాంబ

స్థానిక లాకు సెంటర్ రెల్లిపేటలో కొలువై ఉన్న వడ్డి పోలమాంబ, కుంచమాంబల ఉత్సవాలు ఐదేళ్లకు ఒకసారి నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవాలను సుమారు ఐదు వారాల పాటు నిర్వహిస్తుంటారు. రెల్లి కులస్థులు ఈ ఉత్సవాలను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరుపుతుంటారు.


పెద్దింట్లమ్మ, బోళ్లవారి వీధి


దేశాలమ్మ, చింతలతోట


పుంతలోముసలమ్మ
రామగుండం సెంటర్


మహాలక్ష్మి అమ్మ, పల్లపు వీధి


మావుళ్లమ్మ తల్లి, షావుకారుపేట


వడ్డి పోలమాంబ, కుంచమాంబ, రెల్లిపేట

కౌంటింగ్‌కు సహకరించాలి


ఆచంటలో స్టాండింగ్ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ స్వామినాయుడు

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆచంటలో నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. భీమవరంలోని బి.సీత పాలిటెక్నికంపు కళాశాల 2వ అంతస్తులో కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈవీఎం ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్ ఉంటాయని, ప్రతీ టేబుల్ వద్ద ఒక సూపర్‌వైజర్, సహాయకుడు, మైక్రో,అబ్జర్వర్‌ను నియమిస్తున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుకు 4 టేబుల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కౌంటింగ్ అధికారులు మూడు దశల్లో సాంకేతిక విధానంలో ర్యాండమైజేషన్ చేస్తామన్నారు. కౌంటింగ్ టేబుల్ సంఖ్య అనుగుణంగానే ఏజెంట్లను అనుమతిస్తామన్నారు. వారి ఫారం 18 , గుర్తింపు కార్డులను జారీ చేస్తామన్నారు. నేర చరిత్ర కలిగిన వారిని, బైండోవర్ కేసులు నమోదైన వారిని కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించకుండా అభ్యర్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలక్షన్ ఏజెంట్లు బ్యాలెట్ పేపర్స్ సీరియల్ నంబరు వారీగా కూర్చోవాలన్నారు. అభ్యరి, వారి ఏజెంట్లులో ఎవరో ఒకరిని మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్, అరగంతువాత ఈవీఎం ఓట్లు లెక్కిస్తామన్నారు. రౌండ్ల వారీ ఫలితాలు ఏజెంట్లుకు ఇవ్వడం జరుగుతుందన్నారు. వాటిని ఫారం 17సీతో నిర్ధారించుకోవాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత మాత్రమే 5 ఈవీఎంలకు చెందిన వీవీ ప్యాట్‌లోని ఓట్లను లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి లెక్కిస్తామన్నారు. 6వ తేదీ వరకూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. బాణసంచా కాల్పులు చేయరాదని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్పీ జి.శ్రీనివాస రావు మాట్లాడుతూ శాంతి భద్రతలపై పటిష్టమైన చర్యలు తీసుకొన్నామన్నారు. బాణసంచా విక్రయాలు, పెట్రోలు విక్రయాలపై నోటీసులు జారీ చేశామన్నారు. 144వ సెక్షన్ అమలులో ఉందన్నారు. కౌంటింగ్ ఫలితాలు అనంతరం గ్రామాల్లో శాంతి, భద్రతలకు సహకరించేలా అభ్యర్థులు వారి అనుచరులకు సూచనలు చేయాలని కోరారు. సమావేశంలో అభ్యర్థుల ఏజెంట్లుతో పాటు తహసీల్దారులు ఐపీశెట్టి, ఎంపీడీఓలు పి.నరసింహ ప్రసాద్, ఎస్.శ్రీనివాస దొర, పి.పద్మజ, డి.సుహాసిని, సీఐ రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి హనుమద్ జయంత్యుత్సవాలు

యలమంచిలి: స్థానిక మంచినీటి చెరువుగట్టున ఉన్న భక్తాంజనేయస్వామి ఆలయంలో హనుమద్ జయంతి సందర్భంగా శనివారం స్వామికి పళ్ల రసాలతో పంచామృతాభిషేకం, తమలపాకులు, సింధూరంతో సహస్ర నామార్చన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనాలనుకునే భక్తులు పూజా సామగ్రి సొంతంగానే సమకూర్చుకోవాలని కోరారు.

కిశోర బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


లంకలకోడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: కిశోర బాలికలు రజస్వల అయిన తరువాత రుతుస్రావం ప్రతి నెలా సక్రమంగా జరిగేలా చూసుకోవాలని లంకలకోడేరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. ఎం నవ్యజీవన్ కోరారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలో కిషోర బాలికలు తీసుకోవాలసిన ఆరోగ్య జాగ్రత్తలు, రుతుస్రావ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.నవ్యజీవన్ మాట్లాడుతూ రుతుస్రావం జరిగిన ఐదు రోజుల కంటే ఎక్కువ రోజులు రక్తస్రావం జరిగితే జాగ్రత్తలు పాటించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే రక్తహీనతకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రుతుస్రావం జరిగే ముందు పొత్తికడుపులో నొప్పి, రక్తస్రావం జరగకపోవడం వల్ల తెల్లబట్ట కనిపించడం తదితర లక్షణాలు ఉంటే తక్షణం వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. సీడీపీవో సీహెచ్ ఇందిర మాట్లాడుతూ కిషోర బాలికల ఆరోగ్యపరంగా రక్తహీనతకు గురికాకుండా పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎస్ పి.ఎలిజబెత్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సూపర్‌వైజర్ డి.కమల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పులఖండం సత్యవేణి, ఎస్.మంగ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సిద్ధాంతంలో కిశోర బాలికల అవగాహన ర్యాలీ నిర్వహించారు. గురువారం సిద్ధాంతంలోని అంగన్‌వాడీ కేంద్రంలో రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీఎంఎం రూతుకుమారి, ఏఎన్ఎం రత్నకుమారి, హేమసుధ పాల్గొన్నారు.

కోట్లమ్మ, మారెమ్మల తీర్థ మహోత్సవం


పెనుగొండలో కోట్లమ్మ, మారెమ్మల తీర్థంలో భక్తుల కిటకిట

పెనుగొండ: పెనుగొండ గ్రామ దేవతలు కోట్లమ్మ, మారెమ్మల తీర్థ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి ఆలయం వద్ద అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. నాలుగు రోజులగా నిర్వహిస్తున్న జాతర మహోత్సవాలు గురువారంతో ముగుస్తాయి. సోమవారం రాత్రి గ్రామంలోని పోతురాజు ఆలయం వద్ద గ్రామోత్సవంతో జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి, మంగళవారం అమ్మవార్లకు గ్రామస్తులు మహా నైవేద్యం సమర్పించారు.అనంతరం గురువారం ఉదయం నుంచి అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఎండతాకిడిని సైతం లెక్కచేయకుండా భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు.

సారె సమర్పణ

గ్రామ దేవతలకు పెనుగొండ శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి దేవస్థానం తరపున సారే సమర్పించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సారెను సమర్పించారు.

విద్యాసామగ్రి అందజేత

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ తెలిపారు. గురువారం పాఠశాలలో దాత డిస్ట్రిక్ట్ లయన్స్ లిటరసీ చైర్మన్ పీఎస్‌డీవీ వరప్రసాద్ రూ. 12 వేలు విలువ చేసే విద్యా సామగ్రిని అందజేశారన్నారు. ఈ సందర్భంగా దాత ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

పీఎం లంకలో కార్డెన్ అండ్ సెర్చ్

మొగల్తూరు: ఓట్ల లెక్కింపు రోజున అల్లర్లుకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జి.శ్రీనివాసరావు హెచ్చరించారు. కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా జిల్లా ఎస్పీ అజిత ఆదేశాల మేరకు గురువారం మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పీఎంలంకలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల లెక్కింపు రోజున 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. కౌంటింగ్ రోజున ర్యాలీలు నిర్వహించడానికి అనుమతి లేదన్నారు. మీ గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంచరించినా సమావేశాలు ఏర్పాటు చేసినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ జి.గోవింద్‌రాజు, మొగల్తూరు ఎస్సై కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దొమ్మ వ్యాధి నిరోధక టీకాలు

యలమంచిలి: గ్రామాల్లో పశువులకు దొమ్మ వ్యాధి నిరోధక టీకాలు ముమ్మరంగా వేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. అడవిపాలెం, ఏనుగువానిలంక, పెదలంక గ్రామాలలో గురువారం పశువులకు దొమ్మ వ్యాధి నిరోధక టీకా, గొర్రెలకు చిటుక వ్యాధి నిరోధక ఎంటరో టాక్సీమియా (ఈటీ) వ్యాక్సిన్ వేసినట్లు ఆయన వివరించారు. ఇంత వరకు 850 పశువులకు, 900 గొర్రెలకు ఈ రెండు రకాల టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం అడవిపాలెం, గుంపర్రు, కాంభొట్లపాలెం, ఇలపకుర్రు, అబ్బిరాజుపాలెం, బాడవ గ్రామాల పశు సంవర్ధక సహాయకుల సహాయంతో చేస్తున్నట్లు ఆయన చెప్పారు.